# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JUNE - 1999

# సంక్షిప్త వార్తలు

1999 ఏప్రియల్ 22వ తేదీ గురువారం నాడు నిజామాబాద్ క్రీస్తు సంఘము సేవకులు యన్.టైటస్ గారి ఏకైక కుమారుడు ఎబినేజర్ యొక్క వివాహమ్ము సోదరులు వై ప్రసాద్‌రావ్ గారి కుమార్తె లావణ్యతో ఘనముగా జరిగెను. వివాహ కార్యక్రమమును సోదరులు కె. సత్యం గారు (వరంగల్లు) నిర్వహించగా, జాషువా గూటం గారు వివాహ సందేశము నిచ్చిరి. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుండియు, ఆంధ్ర ప్రాంతములనుండియు మూడువేల మందికి పైగా వచ్చిన బంధువులు, మిత్రులు, సంఘసభ్యులు నూతన దంపతులకు శుభాశ్శీస్సులను తెలిపిరి. వివాహ విందులో పాల్గొనిరి.

ఏప్రియల్ 30వ తేదీ శుక్రవారం నాడు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం వన్నాజిపేట గ్రామంలో నిర్మించబడబోవుచున్న క్రీస్తు సంఘ ప్రార్థనా మందిరమునకు సోదరులు జాషువా గారు శంఖుస్థాపన చేసిరి. సోదరులు యన్. టైటస్ గారి ప్రార్థనతో ఆరంభమైన ఆ ప్రత్యేక కూటములో సోదరులు పెండా ఎలీషా గారు వాక్యపఠనము గావించగా జాషువా గూటం గారు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు యన్. ఆనందరావ్ గారు ముగింపు ప్రార్థన చేసిన తరువాత స్థానిక సంఘము వచ్చిన వారందరికీ చక్కటి విందునేర్పాటు చేసిరి. సోదరులు యన్. టైటస్ గారు నిజామాబాద్ జిల్లాలోనే గాక పరిసర జిల్లాలలోను, మండలములలోను క్రీస్తుకొరకు గొప్ప కృషి సల్పుచు మంచి విజయములు సాధించుచున్నారు. వన్నాజిపేటలోని ఆలయమునకు ముందు టైటస్‌గారు మరి నాలుగు స్థలములలో మంచి ఆలయములను నిర్మించి యుండుట ముదావహము.

1999 మే నెల మొదటితేదీ శనివారం నాడు హైదరాబాద్ శ్రీరామ్‌నగర్‌లో ఏర్పాటు చేయబడిన సువార్త కూటములో జాషువా గారు వాక్య పరిచర్య చేసిరి. ఇద్దరు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. శ్రీరామ్‌నగర్, సనత్‌నగర్, బోరాబోండా, షాపుర్‌నగర్ పరిసర ప్రాంతములలో సోదరులు కె.వి.పాల్ (నరసింహులు) గారు, సత్యమును బోధించుచు, అనేకులను క్రీస్తులోనికి, ఆయన సంఘములోనికి నడిపించుచున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పడమర వీధిలోని క్రీస్తుసంఘము ఏప్రియల్

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 జూన్ 1999 సంచిక 11


## సంపాదకీయం

### సంఘము యొక్క విశ్వాస భ్రష్టత్వము
### (Falling Away of the Church)

పరిచయము : భూదిగంతముల వరకు క్రీస్తుసంఘము విస్తరించుట ఆశ్చర్యంగా యుండినను, అది రెండు రకములైన అలజడులకు ఎదుర్కొనవలసి వచ్చెను: దానికి ప్రతికూలముగా ఉద్భవించిన ఆరిపోజాలని హింసాగ్ని మొదటిది. క్రీ॥శ॥64వ సంవత్సరములో నీరో చక్రవర్తి నుండి మొదలుకొని క్రీ॥శ॥ 311వ సంవత్సరములో యున్న డయొక్లీషియన్ చక్రవర్తి వరకు లక్షలాది క్రైస్తవులు స్థానికముగాను, సార్వజనికముగాను ఈ హింసాగ్నికి ఆహుతియైరి(Halley Page 869). రెండవదిగా-విశ్వాస భ్రష్టత్వమును గూర్చిన హెచ్చరికలు ఉండనే యున్నాయి. సంఘము, క్రైస్తవులు విశ్వాసమునుండి తొలగిపోతారు సుమా అనే హెచ్చరికలు ఆందోళన కలిగించేవిగా లేకపోలేదు. మొదటి అపొస్తలుడు

చనిపోవకముందే, క్రీస్తుసంఘ సభ్యులు క్రీస్తు బోధనుండి తొలగిపోవుటకు మొదలిడారు. అయితే అది అకస్మాత్తుగా వచ్చిపడిపోలేదు.

## అది ప్రవచింపబడెను

"నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొనిపోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు" (అపొ.కా. 20:29-30).

"అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మతేటగా చెప్పుచున్నాడు" (1తిమోతి 4:1).

"మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాప పురుషుడు బయలు పడితేనే గాని ఆ దినము రాదు" (2థెస్స 2:3).

## ప్రత్యేక హెచ్చరికలు ఈయబడెను

క్రీస్తుచెప్పినవి :

- "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు గాని లోపల వారు క్రూరమైన తోడేళ్లు" (మత్తయి 7:15).

- "ఆకాలమందు అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైన యెడల ఏర్పరచబడిన వారిని మోసపుచ్చుటకై సూచక క్రియలను మహత్కార్యములను అగపరచెదరు" (మార్కు 13:22-23).

"అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచెదరు" (మత్తయి 24:24).

అపొస్తలులు చెప్పినవి :

- "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" (1యోహాను 4:1).

- "మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు" (2పేతురు 2:1).

- "అయితే దుర్జనులును వంచకులును ఇతరులను మోసపరచుచు తాము మోసపోవుచు అంతకంతకు చెడిపోవుదురు" (2తిమోతి 3:13).

- "...అంత్యకాలమునందు తమ భక్తిహీనమైన దురాశల చొప్పున నడుచు పరిహాసకులుందురు" (యూదా :14).

## భ్రష్టత్వ బీజములు అప్పటికే నాటబడెను

- "ధర్మ విరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది" (2థెస్స 2:7).

- ఇప్పుడును క్రీస్తు విరోధులు బయలుదేరి యున్నారు" (1యోహాను 2:18).

- "యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది, యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు; ... క్రీస్తువిరోధి ఆత్మ వచ్చునని మీరు వినిన సంగతి

ఇదే; యిది వరకే అది లోకములో ఉన్నది" (1యోహాను 4:2-3).

## విశ్వాస భ్రష్టత్వ వాస్తవములు

**భ్రష్టత్వము ఎప్పుడు సంభవించును ?**

- "కడవరి దినములలో" (1తిమోతి 4:1). క్రీస్తువిరోధి ఆత్మ ప్రబలు సరికి అది కడవరి దినములని యోహాను వివరించాడు. గనుక క్రీస్తు తిరిగి వెళ్లిన కొంతకాలానికి ఈ కడవరి దినములు వచ్చును. క్రీస్తులేకుండా క్రీస్తు విరోధి యుండడు గదా (1యోహా 2:18).

- అది క్రీస్తుయొక్క రెండవరాకడకు ముందు జరుగును (2థెస్స 2:3).

- క్రీస్తువిరోధి ఆత్మ అప్పటికే లోకములో యున్నది (1యోహాను 2:18).

**ఎక్కడ సంభవించును ?**

- "వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు" (అపొ.కా. 20:30)

- "మరియు అబద్ధప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు... వీరు నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు" (2పేతురు 2:1).

**ఎందువలన సంభవించును ?**

- "ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసుకొందురు" (2తిమో 4:3).

- "కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురు" (1తిమో 4:1).

- "నశించుచున్న వారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి" (2థెస్స 2:9).

- మనుష్యులు సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష గలవారైరి (2థెస్స 2:12).

- మనుష్యులు "సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపు" తిరుగుదురు (2తిమో 4:4).

ఎట్లు సంభవించును ?

- అబద్ధ ప్రవక్తలు వచ్చి ప్రజలను మోసగించిరి (మత్తయి 24:24).

- కొందరు మరియొక సువార్తను ప్రకటించిరి (గలతీ 1:6-8).

- క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రమును కూడా అనుసరించాలని కొందరు బోధింప మొదలిడిరి (గలతీ 5:1-4).

- కొందరు భిన్నాభిప్రాయములచే సంఘమును విభజించిరి (1కొరింథీ 1:10-13).

- వేదాంతులు దేవుని జ్ఞానము కంటే మానవ జ్ఞానము ఉన్నతమైనదని భావింప మొదలిడిరి (1కొరింథీ 1:18-29).

- కొందరు అసత్యముతో రాజీపడిపోయిరి (2కొరింథీ 6:14-17).

- మరికొందరు ప్రభురాత్రి భోజనమును అపవిత్ర పరచిరి (1కొరింథీ 11:18-29).
- నవీనాచారులు(Modernists) ప్రభువునే తిరస్కరించిరి (2పేతురు 2:1; యూదా :3-4).
- సందేహశీలురు క్రీస్తుయొక్క దైవత్వాన్ని నిరాకరించిరి (1యోహాను 4:2-3).

## సంగ్రహణము

విశ్వాస భ్రష్టత్వము సంభవించునని ముందుగనే చెప్పబడెను. మరియు క్రొత్తనిబంధన దానిని గూర్చిన హెచ్చరికలతో నిండియున్నది. భ్రష్టత్వ సంబంధిత బీజములు ఆదిమ సంఘములోనే యుండెను. "ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది" (2థెస్స 2:7), "క్రీస్తువిరోధి ఆత్మ" అప్పటికే పని చేయుచున్నాడను మాటలలో యిది తేటతెల్లమగుచున్నది. అది ఎప్పుడు సంభవలసియున్నది? అది ఆదిమ సంఘములో ఆరంభమై క్రమేపి వ్యాప్తి జెందినది. అది ఏలాగు వ్యాప్తి జెందెనో రాబోవు పాఠములలో సవిస్తరముగా తెలిసికొందము. అది ఎక్కడ మొదలిడింది ? సంఘములోనే, దాని పెద్దలైన నాయకులలోనే మొదలిడినది. అది ఎందుకు జరిగింది? మానవుడు సత్యమును అన్వేషించి దానిని అంగీకరించుటకు నిర్లక్ష్యము చేయుట వలన సంభవించినది. వారు దుర్నీతిని అడ్డుకొనుటకు, సత్యమునందు నిలబడుటకు నిరాకరించిరి. తత్ఫలితముగా అబద్ధ బోధకు గురియై దానికి బానిసలైరి. మానవులు వారేమి వినాలనుకొనుచున్నారో ఆ సంగతులను బోధించే వాడెవడైనను సరే వానినే వినుటకు దురద చెవులు గలవారై అత్యాసక్తిని కనుబరచిరి. దేవుని జ్ఞానము కంటే మానవ జ్ఞానమునే వారు ఇష్టపడిరి. అదెలాగు సంభవించినది ? అపవాది యొక్క ఏజెంట్లు (అబద్ధబోధకులు, అబద్ధ ప్రవక్తలు, సంశయశీలురు

మొదలగువారు) వారికి ప్రవేశము దొరికిన ప్రతి సంఘములోను ప్రవేశించి విష బీజములను నాటిరి. వారిని వినడానికి వచ్చేవారు అత్యాసక్తిని కనుబరచిరి.

అది నిరోధించబడవచ్చును గదా ? అవును తప్పకుండా. గాని ఎప్పుడు ?, క్రీస్తుసంఘ సభ్యులు దేవుని వాక్యమైన బైబిలుకు ఘనత గౌరవములు ఆపాదించినప్పుడే. దేవుని వాక్యానికే సర్వాధికారము ఆపాదించినప్పుడే అది సాధ్యమగును. మానవులు దేవుని అధికారమునకు గాక మానవ సలహాలకు లోనైనప్పుడు విశ్వాసమునుండి తొలగిపోయిరి. లేఖనముల యెడల మనము సరియైన మస్తత్వమును కలిగియుండుట ఎంత అవుసరమో రాబోయే పాఠాలలో నేర్చుకొందము.

## మోసపోకుడి
## (Be Not Deceived)

మనం మోసపోరాదని దేవుని వాక్యం తరుచు హెచ్చరించుచున్నది. మోసపోవడం అంటే ఒకనిని తప్పుదారి పట్టించారనీ, అబద్ధాలు చెప్పారనీ, అసత్య బోధచేయబడిందనీ, దాన్ని అంగీకరించాడనీ యర్థం. చదువుకొని గ్రహించుటకు మనకు లేఖనాలున్నాయి గనుక మోసగించబడనవసరం లేదు. గాని మనం మోసగించబడ్డాము.

"ఎవడును మిమ్ము్మను మోసపరచకుండ చూచుకొనుడి అనేకులు నా పేరట వచ్చి-నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు" అని యేసు చెప్పెను (మత్తయి 24:4,5). నేను క్రీస్తునని, మెస్సీయానని చెప్పుకొను వేషధారులను గూర్చి ఆలోచించుము. అట్టివారి అబద్ధాలను నమ్మేవారెవరు ఉండరని మనం అనుకోవచ్చును. గాని అనేకులున్నారు.

పౌలు ఇట్లు హెచ్చరించాడు: "అన్యాయస్థులు దేవునిరాజ్యమునకు

వారసులు కానేరరని మీకు తెలియదా ? మోసపోకుడి, జారులైనను, విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను ఆడంగి తనము గలవారైనను, పురుష సంయోగులైనను, దొంగలైనను, లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1కొరింథీ 6:9,10). మరల, "మోసపోకుడి. దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును" అని అతడు చెప్పాడు (1కొరింథీ 15:33).

గలతీయులకు వ్రాయుచు అపొ.పౌలు ఇట్లు చెప్పాడు: "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంటకోయును" (గలతీ 6:7,8).

"అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను, తప్పు మార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొని పోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండరాదు" (ఎఫెసీ 4:14). "వ్యర్థమైన మాటల వలన ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి. ఇట్టి క్రియల వలన దేవుని ఉగ్రత అవిధేయులైన వారి మీదికి వచ్చును గనుక మీరు అట్టివారితో పాలివారై యుండకుడి" యని ఎఫెసులోని క్రైస్తవులను పౌలు హెచ్చరించెను (ఎఫెసీ 5:6,7).

థెస్సలోనీయులకు వ్రాయుచు, పౌలు "మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాపపురుషుడు బయలుపడితేనే గాని ఆ దినము రాదు... గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి" యని చెప్పెను (2థెస్స 2:3). "అయితే దుర్జనులును వంచకులును ఇతరులను మోసపరచుచు

తాముసు మోసపోవుచు అంతకంతకు చెడిపోవుదురు" అని అతడు తిమోతిని హెచ్చరించెను (2తిమో 3:13).

"మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" యని యాకోబు వ్రాసెను (యాకోబు 1:22). యోహాను ఇట్లు వ్రాసాడు: "మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము, మరియు మనలో సత్యముండదు" (1యోహాను 1:8).

ఈ లేఖన భాగములను బట్టియు, ఇతర లేఖనములను బట్టియు ఒకడు మోసగించబడి నిత్యనాశనము నొందుట సాధ్యమేయని మనము గ్రహించుకొనగలము.

ఒకడు తన్నుతానే మోసగించుకొనవచ్చును. తన యిష్టము వచ్చినది నమ్మి అది సత్యమో కాదోయని లెక్కచేయక, తాను నమ్మినదే రైటు అనుకొని తన్నుతాను మోసగించుకొనవచ్చును. "నీ హృదయపు గర్వము చేత నీవు మోసపోతివి" యని అనేక శతాబ్దముల క్రితమే ఓబద్యా ప్రవక్త చెప్పాడు" (ఓబద్యా 1:3).

ఇతరులు తన్ను మోసగించేలాగున ఒకడు వారికి అవకాశమియ్యవచ్చును. పౌలు రోమీయులకు ఇట్లు చెప్పాడు: "మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేధములను ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడి. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకు దాసులు; వారు ఇంపైన మాటల వలనను ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17,18). ఒక్కోసారి బోధకుల యందున్న ప్రగాఢమైన నమ్మకము వలనే వారు బోధించేది అసత్యమైనను, బైబిలుకు వ్యతిరేకమైనదైనను ప్రశ్నించకుండా కొందరు దానిని అంగీకరించి మోసగించబడుదురు.

ప్రజాదరణ పొందిన అబద్ధ బోధను బట్టి ఒకడు మోసగించబడవచ్చును. కొన్ని అబద్ధ బోధలు శతాబ్దముల తరబడి బోధింపబడుచుండుట వలన, అవి బైబిలు విరుద్ధమైనవే అయినను, అవే సత్యమువలెనగుపడును. ఇంపైన మాటలు, ఇచ్చకములను గూర్చి పౌలు చేసిన హెచ్చరికను మనందరం ఖాతరు చేయాలి.

మెజారిటీ ప్రజల వలన మోసగింపబడవచ్చును. ఎక్కువమంది ఫలాని సంగతిని నమ్ముచున్నారు గనుక వారు తప్పులో యుండరను కొనవచ్చును. అట్టి సందర్భాలలో మత్తయి 7:13,14లో యేసు చెప్పిన మాటలను జ్ఞాపకముంచు కొనాలి, " ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించు వారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది. దాని కనుగొను వారు కొందరే".

అనేక విషయములలో మానవులు మోసగించబడుచున్నారు. రక్షణ మార్గమును గూర్చి, క్రీస్తుసంఘమును గూర్చి, ఆమోద యోగ్యమైన ఆరాధనను గూర్చి, ఆయన రెండవ రాకడను గూర్చి వివిధ బోధలు చేయబడుట వలన మోసగించబడుచున్నారు. మానవకల్పిత బోధలే సత్యమని ప్రజలు అంగీకరించు చున్నారు. బైబిలులో బయలు పరచబడిన సత్యాన్ని నిరాకరించుచున్నారు. వారు దేవుని మాటలకంటే మానవుల మాటలనే ఎక్కువ వినియున్నారు! ఆత్మీయ విషయాల్లో దేవుని వాక్యాన్నే అనుసరించవలసిన బాధ్యత మనకున్నది.

- జె.సి.ఛోట్.

11.

# జీవితము స్వల్పము - మరణము తథ్యము
## (Life is Short and Death is Sure)

ఒకరోజు నేను బజారునకు వెళ్ళాను. అక్కడ ఒక దుకాణపు ద్వారముపై ఈ మాటలు గల పత్రిక అంటించబడియున్నది. "జీవితము స్వల్పము-మరణము తథ్యము". కొద్ది క్షణాలు నేను ధ్యానము చేసి ఆ మాట ఎంత నిజమో గ్రహించాను. ఈ సత్యాన్ని గూర్చి దేవుని గ్రంథము మనకు మరలా గుర్తు చేయుచున్నది. బైబిలులోని కీర్తనకారుడు ఈ విధముగా తెలియజేయుచున్నాడు: "మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు అయిననూ వాటి వైభవము ఆయాసమే దుఃఖమే. అది త్వరగా గతించును మేము ఎగిరిపోవుదుము" (కీర్త 90:10). తన జీవన ప్రమాణాన్ని పెంచుటకు మానవుడు వెదుకని మార్గము లేదు. వెదుకని పద్ధతి లేదు. తాను ఆరోగ్యముగానుండుటకు అన్ని రకాల పరిశ్రమలు చేయుచున్నాడు. ఎక్కువకాలం జీవించాలని కొందరు మందులు, విటమినులు తీసికొనుచున్నారు. కాని ఒకానొక దినమున ఈ లోకమును విడిచిపెట్టి నిత్యనివాసము చేసే ప్రదేశాన్కి పోవాలనే సత్యాన్ని మరచిపోకూడదు. కీర్తనకారుడు ఈ విధంగా ప్రార్థించుచున్నాడు.

> "యెహోవా నా అంతము ఎట్లుండునని, నా దినముల ప్రమాణము ఎంతైనది నాకు తెలుపుము. నా ఆయువు ఎంత అల్పమైనదో నేను తెలిసికొనగోరుచున్నాను. నా దినముల పరిమాణము నీవు బెత్తెడంతగా చేసియున్నావు. నీ సన్నిధిని నా ఆయుష్కాలము లేనట్టేయున్నది. ఎంత స్థిరుడైననూ ప్రతీవాడు ఊపిరివలె ఉన్నాడు. మనుష్యులు వట్టి నీడవంటివారై తిరుగులాడుదురు. వారు తొందరపడుట గాలికే కదా! వారు ధనము కూర్చుకొందురు గాని అది ఎవనికి చేజిక్కునో వారికి తెలియదు" (కీర్తన 39:4-6).

మానవుని జీవితము యొక్క అల్పత్వమును గూర్చి బాగుగా ఆలోచించాలి. మన

ఆయువు ఈలోకములో ఎంత స్వల్పమైనదో బైబిలులో అనేకసార్లు చెప్పబడినది. మనచేతి బెత్తెను చూచుకొని జీవితమును గూర్చి ఆలోచించిన మన జీవితం ఎంత స్వల్పమైనదో మనకు తెలియును.

## మీ జీవమేపాటిది ?

యాకోబు జీవితమును గూర్చి ఒక ముఖ్యమైన ప్రశ్నను వేస్తూ మనలను జాగృతము చేయుచున్నాడు. ఆయన ఈలాగు చెప్పుచున్నాడు. "మీ జీవమేపాటిది? "దాని గురించి మీరు ఆలోచించారా ? ప్రజలు రేపేమి సంభవించునో తెలిసికొనక రేపటిని గూర్చి ఎన్నో పథకములు వేసుకొనుట మనము వినుచుందుము. కొన్నిసార్లు వారు ఇట్లనుకొందురు:

"నేడైననూ రేపైననూ ఒకానొక పట్టణమునకు వెళ్ళి అక్కడ ఒక సంవత్సరము ఉండి, వ్యాపారము చేసి, లాభము సంపాదింతము రండని చెప్పుకొను వారలారా! రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే" (యాకోబు 4:13-17).

మానవుడు ఈలోకములో కొద్దికాలము మాత్రమే ఉండునని యోబు గ్రంథము కూడా తెలియజేయుచున్నది.

"స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధనొందును. పువ్వు వికసించినట్లు పెరిగిపోవును. నీడ కనబడకపోవునట్లు వాడు నిలువక పారిపోవును" (యోబు 14:1-2).

## తీర్పు నిశ్చయము

ఒకానొక దినమున మనము చావునెదుర్కొన్నా. మరణమును ఆపేశక్తి ఎవరికి లేదు. "మనుష్యులు ఒక్కమారే మృతిపొందవలెనని నియమింపబడెను

ఆ తరువాత తీర్పు జరగును" (హెబ్రీ 9:27). నిశ్చయముగా మనమందరము చనిపోవలసిన వారము. ఈ జీవిత సత్యమునుండి తప్పించుకొనేవారు ఎవరూ లేరు. మన జీవితాన్ని కొంతకాలము పొడిగించవచ్చు కాని ఒకానొక దినమున మనము చనిపోవలసిన వారమై యున్నాము. అపొ.పౌలు కొరింథిలోనున్న క్రైస్తవులకు వ్రాస్తూ ఒక దినమున క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షపరచబడాలని గుర్తు చేయుచున్నాడు. "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైననూ సరే చెడ్డవైననూ సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతీవాడు పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (రోమా 14:12). అవును మరణమును మరియు న్యాయతీర్పును తప్పింపబడనివి. ఈసత్యమునను సరించి జీవితము నిజముగా ఎంత స్వల్పమైనదో గమనించుదాము.

ఈలోకములో చాలమంది ప్రజలు ఈసత్యమును గంభీరముగా తీసికొనుటలేదు. చాలామంది ఈ జీవితము ఇహలోక సౌఖ్యములు అనుభవించుట కొరకే అని తలంచుచున్నారు. కొంతమంది రేపటి దినమును ఎవరు చూడొచ్చారులే అని అపహాస్యము చేస్తున్నారు. మేము సంతోషంగా గడపాలి అని అనుకొంటున్నారు. అలాంటి వారికి జ్ఞానియైన సొలోమోను ఈలాగు బోధిస్తున్నాడు: "గూఢమైన ప్రతి యంశమును గూర్చి దేవుడు విమర్శచేయునపుడు ఆయన ప్రతీ క్రియను అది మంచిదే కాని చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12:14). దేవుని మరియు ఆత్మ సంబంధమైన విషయములపై జాగ్రత్తలేని వారి పరిస్థితి ఎంత విచారకరమైనది! లోకము ఎంత వెఱ్ఱితనముగానున్నది! ప్రజలు ఆత్మసంబంధమైన విషయములకంటే ఆనందదాయకమైన కోరికలనే ఎక్కువ ఇష్టపడుచున్నారు. ఒకానొక దినమున దేవునియొక్క ఉగ్రత అనీతిమంతులపై ఉండును. పౌలు రోమీయులకు ఈలాగు వ్రాయుచున్నాడు:

"దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత

మీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకము నుండి బయలు పరచబడు చున్నది. ఎందుకనగా దేవునిగూర్చి తెలియశక్యమైనదేదో అది వారిమధ్య విశదమై యున్నది. దేవుడు అదివారికి విశదపరచెను. ఆయన అదృశ్యలక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి. గనుక వారు నిరుత్తరులై యున్నారు. మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనూ లేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి" (రోమా 1:18-21).

## వెర్రివాడైన ధనవంతుడు

ధనవంతులు కాగోరు వారిని మనము చూస్తున్నాము. ఎలాగోలాగ వారు ధనవంతులు కావలెనని కోరుచున్నారు. ఆ ధనమును సంపాదించుటకు వారు ఏమి త్యాగము చేస్తారో అది అనవసరము. త్యాగము చేసి తమ స్వకీయ ఉద్దేశముల కొరకు దేవునినుండి దూరముగా తొలగిపోతారు. ఈలోకములో వారి జీవితము యొక్క ప్రాముఖ్యతను మరచిపోతారు ఈ లోకములో వారి జీవితము యొక్క ప్రాముఖ్యతను మరిచిపోయే వారుగా ఉంటారు. ఎంత కాలము ఈలోకములో జీవించి యుందురో వారు గుర్తించరు. బైబిలులో ఒక చక్కని ఉదాహరణ కలదు. ఒక మనుష్యుడు చాలా ధనవంతుడు. అదే సమయములో అతడు వెఱ్ఱివాడు. ఈ మనుష్యుడు తనకు కలిగినదంతా అస్థిరమని మరచిపోయాడు. ఈ మనుష్యుడు తనకు కలిగిన ఆస్థి అంతటితో ఈ లోకములో ఎప్పటికీ ఆనందముగా అనుభవిస్తానని తలంచాడు. అతడు జీవితము స్వల్పము - మరణము తథ్యమని మరచిపోయాడు. అతడు తన ప్రాణమును పోగొట్టుకొనే క్షణాన్ని గూర్చి ఎన్నడూ తలంచలేదు (లూకా 12:13-20). ధనవంతుడైన వెఱ్ఱివాని నోటనుండి ఈ వెఱ్ఱి మాటలు వచ్చాయి. "నా ప్రాణముతో-ప్రాణమా అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్థినీకు సమకూర్చబడియున్నది. సుఖించుము, తినుము, త్రాగుము

సంతోషించుము అనిచెప్పుకొందునను కొనెను". అయితే దేవుడు - "వెఱ్ఱివాడా ఈ రాత్రి నీ ప్రాణమునడుగుచున్నారు. నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను". ఎంత ధనవంతులమైనా ఆస్తిగలవారమైనప్పటికి మరణమును తప్పించుకోలేము. మనము ఈ భూమిపై పరదేశులమని తలంచుటలేదు. మనము యాత్రికులము. అపొ.పేతురు ఈలాగు చెప్పుచున్నాడు, "ప్రియులారా మీరు పరదేశులును యాత్రికులునై యున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించుడి" (1పేతురు 2:11).

## జ్ఞానులవలె ప్రవర్తించాలి

ఈలోకములో మనకెంతకాలము ఇయ్యబడినదో మనము తెలియదు కాని మన జీవితము ఎంత త్వరగా గతించిపోవునో జ్ఞాపకముంచుకొనండి. మన ప్రాణమును గూర్చి జాగ్రత్తకల్గియుందము మనకీయబడిన సమయమును జ్ఞానముతో సద్వినియోగము చేసికొందము. ఎఫెస్సీయులకు వ్రాసిన పత్రికలో పౌలు ఈవిధముగా అంటున్నాడు: "దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె నడచు కొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫె 5:15-16). మీ జీవితమును గూర్చి జాగ్రత్త కల్గియున్నారా ? మరణమగుటకు సిద్దపడియున్నారని తలంచుచున్నారా? మీరు నేను కూడా ఎక్కువ కాలము జీవించి యుండమని తెలుసుకోండి. మన జీవనము ప్రయాణమువలెనున్నది. ఒక దినమున మన ప్రయాణము ముగుస్తుంది. ఈలోకమునకు వీడ్కోలు పలుకవలసియున్నది. మనము నిత్యరాజ్యములోనికి వెళ్లాలి. మనము తిరిగి ఇక్కడకు రాలేము. ఎందుకనగా ఈలోకము మన నివాసము కాదు.

మన ప్రభువైన యేసు మానవులందరికొరకు రక్షణను తీసికొనివచ్చెను. అందరికొరకు ఆయన తన రక్తాన్ని చిందించెను. తన్ను రక్షకునిగా అంగీకరించుటకై

ఆయన అందరిని పిలుచుచున్నాడు. యేసుయొక్క బల్యర్పణ అద్వితీయమైనది. ఆయన ప్రత్యేకింపబడిన జాతివారి కొరకు చనిపోలేదని గమనించండి. ఆయన లోకములోని ప్రజలందరి కొరకు చనిపోయెను. ఆయన నిన్ను ప్రేమించి ఈ విధముగా పిలుచుచున్నాడు: "ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి నేడు మీకు విశ్రాంతిని కలుగజేయుదును" (మత్తయి 11:28). నీవు యేసునొద్దకు వచ్చి ఆయనకు విధేయుడవైతే నీవు చింతించవలసిన అవసరము లేదు. ఎందుకనగా ఆయన పరలోకములో నిత్య నివాసమును ఇస్తానని వాగ్దానము చేసెను. ప్రభువునందు మృతినొందుట ఆశీర్వాదకరము. "ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు" (ప్రక 14:13).

## క్రీస్తులో రక్షణ

"ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో **ఆలాగుననే** క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" (1కొరింథీ 15:22). మనము ప్రభువునందు మృతి బొందితే నిత్యజీవము మనది. పరలోకములో మనప్రభువైన యేసుతో కూడా నివసించుట ఎంతో దీవెనకరమైనది. నీ జీవితమును ఆయనకు సమర్పించావా? లేక ఇంకను కనిపెట్టుచున్నావా ? ఇంకనూ ఆలస్యముచేయవద్దు. నిన్ను బ్రతిమాలు కొనుచున్నాను. "జీవితము స్వల్పము -మరణము తథ్యము" "ఇదే రక్షణదినము" (1కొరింథీ 6:2). క్రీస్తు నీవద్ద నుండి సంపూర్ణ విధేయతను కోరుచున్నాడు. ఒకవేళ మీలో కొంతమందికి ఆయనయందు విశ్వాసముండవచ్చు. యేసునందు విశ్వాసమున్న యెడల ఆయన దేవుని కుమారుడుగా ఒప్పుకొనవలెను (మత్తయి 10:32,33); (రోమా 10:10). పాత పాప జీవితమును గూర్చి మారు మనస్సు పొందాలి. రక్షణకు మారుమనస్సు అవుసరము. (అపొ.కా. 2:38; 3:19). ఇంతటితో ఆగిపోవద్దు నీవు బాప్తీస్మము తీసికొనవలసిన అవసరత ఉన్నది. బాప్తీస్మము తీసికొనుట దేవుని ఆజ్ఞయైయున్నది కనుక దానినుండి తప్పించు కొనవద్దు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16).

పెంతెకొస్తు దినమున మూడువేలమంది రక్షింపబడ్డారు. ఆ ప్రజలు ఏమి చేసారు ? వారు బాప్తిస్మము పొందారు (అపొ.కా. 2:38, 41). ఆ ప్రజలు పెంతెకొస్తు దినమున పేతురుతో ఈ విధంగా చెప్పలేదు. "అయ్యా మేము యేసుని విశ్వసించాము ఆయనను మా స్వంత రక్షకునిగా అంగీకరించాము కాని మాకు బాప్తిస్మము వద్దు". "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు క్రీస్తును ధరించు కొందురు" "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు క్రీస్తును ధరించుకొందురు" (గలతీ 3:27). బాప్తిస్మము లేకుండా నీవు క్రీస్తును ధరించుకోలేవు. "బాప్తిస్మము ద్వారా యేసుయొక్క సమాధిలోనికి బాప్తిస్మము పొందుచున్నాము" (రోమా 6:3). పరిపూర్ణ విధేయత ద్వారా సంఘములోనికి చేర్చబడుదురు. సంఘమనగా క్రీస్తు శరీరములోనికి (అపొ.2:47; 1కొరింథీ 12:13; కొలస్స 2:12). క్రైస్తవుడయిన తరువాత క్రీస్తు కార్యాభివృద్ధి యందు ఆసక్తి కల్గియుండాలి (1కొరింథీ 15:58).

## జీవ కిరీటం

ప్రతీరోజు మన జీవిత పర్యంతము క్రీస్తుకు నమ్మకముగా ఉండాలి. "మరణము వరకూ నమ్మకముగాయుండుము. నేను నీకు జీవకిరీటము నిచ్చెదను" (ప్రక 2:10). ఇపుడు మీరు క్రీస్తులో ఉన్నట్లయిన మీరు చావునకు భయపడవద్దు. ఎందుకనగా యేసు పరలోకములో ఆయనతో కూడా నివసించుటకు మనకొరకు స్థలము సిద్ధపరచునను నిశ్చయత మనకున్నది (యోహాను 14:1-3). యేసులో యుండుట అనగా పరలోకములో నిత్యజీవము కొరకు సిద్ధపాటు కల్గియుండుట. చివరిగా అపొ.పౌలుచే 2తిమోతి 4:6-8లో వ్రాయబడిన మాటలను గమనించు దాము.

"మంచి పోరాటమును పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని. విశ్వాసమును కాపాడుకొంటిని. ఇకమీదట నాకొరకు జీవకిరీటము ఉంచ బడినది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును,

నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించు వారి కందరికిని అనుగ్రహించును".

నీవు తీర్పు దినమును ఎదుర్కొనుటకు సిద్ధపడియున్నావా ? రాబోవు మరణము కొరకు కనిపెట్టుచున్నావా ? జాగ్రత్తగా యుండుమని మరొకసారి జ్ఞాపకముచే చేయుచున్నాను. మరణమాసన్నమయితే, సిద్ధపడకుంటే ఇప్పటికే ఆలస్యమైనది. ఇప్పుడే సిద్ధపడు.

- ఫ్రాన్సిస్ డేవిడ్, న్యూఢిల్లీ.

## మంచికాపరి
## (The Good Shepherd)

మంచికాపరిని గూర్చి తెలిసికొనక మునుపు మనకు మాదిరికరముగాను, బాలశిక్షకుడుగాను, దృష్టాంతముగాను యున్నటువంటి పాతనిబంధనను ఒకసారి తెరచి చూద్దాం. ప్రవక్తయైన యెహెజ్కేలు గ్రంధము **34:1-19** వరకు చదివిన యెడల ఈలాగు వ్రాయబడియున్నది:

"మరియు యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను నరపుత్రుడా, ఇశ్రాయేలీయుల కాపరులను గూర్చి ఈ మాట ప్రవచింపుము, ఆ కాపరులతో ఇట్లనుము - ప్రభువగు యెహోవా సెలవిచ్చున దేమనగా - తమ కడుపు నింపుకొను ఇశ్రాయేలీయుల కాపరులకు శ్రమ; కాపరులు గొఱ్ఱెలను మేపవలెను గదా. మీరు క్రొవ్విన గొఱ్ఱెలను వధించి క్రొవ్వును తిని బొచ్చును కప్పుకొందురు గాని గొఱ్ఱెలను మేపరు,బలహీనమైనవాటిని మీరు బలపరచరు, రోగముగలవాటినిస్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టుకట్టరు, తోలివేసిన వాటిని మరల తోలుకొనిరారు, తప్పిపోయిన వాటిని వెదకరు, అది మాత్రమేగాక మీరు కఠిన మనస్కులై బలాత్కారముతో వాటిని ఏలుదురు. కాబట్టి కాపరులు లేకయే

అవి చెదరిపోయెను, చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారమాయెను. నా గొఱ్ఱెలు పర్వతములన్నిటిమీదను ఎత్తయిన ప్రతి కొండమీదను తిరుగులాడు చున్నవి, నా గొఱ్ఱెలు భూమి యందంతట చెదరిపోయినను వాటిని గూర్చి విచారించువాడొకడును లేడు, వెదకువాడొకడును లేడు. కాబట్టి కాపరులారా, యెహోవా మాట ఆలకించుడి కాపరులు లేకుండ నా గొఱ్ఱెలు దోపుడు సొమ్మయి సకలమైన అడవి మృగములకు ఆహారమాయెను; కాపరులు నా గొఱ్ఱెలను విచారింపరు, తమ కడుపు మాత్రమే నింపుకొందురు గాని గొఱ్ఱెలను మేపరు; ఇదే ప్రభువైన యెహోవా వాక్కు కాబట్టి కాపరులారా యెహోవా మాట ఆలకించుడి. ప్రభువైన యెహోవా సెలవిచ్చున దేమనగా నా జీవముతోడు నేను ఆ కాపరులకు విరోధినైతిని, నా గొఱ్ఱెలనుగూర్చి వారియొద్ద విచారించెదను, వారు గొఱ్ఱెలు మేపుట మాన్పించెదను, ఇకను కాపరులు తమ కడుపు నింపుకొనజాలక యుందురు; నా గొఱ్ఱెలు వారికి తిండికాకుండా వారి నోటనుండి వాటిని తప్పించెదను, ఇదే ప్రభువైన యెహోవా వాక్కు.

ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఇదిగో నేను నేనే నా గొఱ్ఱెలను వెదకి వాటిని కనుగొందును. తమ గొఱ్ఱెలు చెదరిపోయి నప్పుడు కాపరులువాటిని వెదకునట్లు నేను నా గొఱ్ఱెలను వెదకి, చీకటిగల మబ్బుదినమందు ఎక్కడెక్కడికి అవి చెదరిపోయెనో అక్కడనుండి నేను వాటిని తప్పించి ఆయా జనులలోనుండి వాటిని తోడుకొనివచ్చి, ఆయా దేశములలోనుండి వాటిని సమకూర్చి వాటి స్వదేశములోనికి వాటిని తెచ్చి పర్వతములమీదను వాగుల యొద్దను దేశమందున్న సకలమైన కాపురపు స్థలమందును వా టిని మేపెదను. నేను మంచి మేతగలచోట వాటిని మేపెదను, ఇశ్రాయేలుయొక్క ఉన్నత స్థలముల మీద వాటికి దొడ్డి యేర్పడును, అక్కడ అవి మంచిదొడ్డిలో పండుకొనును, ఇశ్రాయేలు పర్వతముల మీద బలమైన మేతగల స్థలమందు అవి మేయును, నేనే నా గొఱ్ఱెలను మేపి పరుండ బెట్టుదును; ఇదే ప్రభువగు యెహోవావాక్కు తప్పిపోయిన దానిని నేను

వెదకుదును, తోలివేసిన దానిని మరల తోలుకొని వచ్చెదను, గాయపడిన దానికి కట్టు కట్టుదును, దుర్బలముగా ఉన్నదానిని బలపరచుదును; అయితే క్రొవ్విన వాటికిని బలముగల వాటికిని శిక్షయను మేతపెట్టి లయపరచెదను. నా మందా, మీ విషయమై దేవుడనైన యెహోవానగు నేను సెలవిచ్చునదేమనగా గొఱ్ఱెకును గొఱ్ఱెకును మధ్యను గొఱ్ఱెలకును పొట్టేళ్లకును మధ్యను, గొఱ్ఱెలకును మేకపోతులకును మధ్యను భేదము కనుగొని నేను తీర్పు తీర్చెదను. విశేషముగా మేతమేసి మిగిలిన దానిని కాళ్లతో త్రొక్కుట మీకు చాలదా ? మీరు స్వచ్ఛమైన నీరు త్రాగి మిగిలిన దానిని కాళ్లతో కలకలు చేయుట మీకు చాలదా ? మీరు కాళ్లతో త్రొక్కిని దానిని నా గొఱ్ఱెలు మేయవలెనా ? కాళ్లతో మీరు బురదగా కలిపిన దానిని అవి త్రాగవలెనా ?" ఇశ్రాయేలీయుల కాపరులను గూర్చి యెహెజ్కేలు ద్వారా దేవుడు సెలవిచ్చిన ఈ మాటలను గమనిద్దాం:

ఇశ్రాయేలీయుల కాపరులు :-

1. కడుపు నింపుకొనువారు
2. గొఱ్ఱెలను మేపరు
3. బలహీనమైన వాటిని బలపరచరు
4. రోగముగల వాటిని స్వస్థపరచరు
5. గాయపడిన వాటికి కట్టుకట్టరు
6. తోలివేసిన వాటిన మరలా తోలుకొనిరారు
7. తప్పిపోయిన వాటిని వెదకరు
8. కఠిన మనస్కులై బలత్కారముగా వాటిని ఏలుదురు.

కాబట్టి కాపరులు లేకయే అవి చెదరిపోయెను, చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారమాయెను.

కాపరి అంటే కాపాడువాడు, గాయము కట్టువాడు స్వస్థపరచువాడు అన్నిటికి మించి శత్రుభయమునుండి వాటిని రక్షించువాడు. ఈ లక్షణములు వారికి లేవు గనుక గొఱ్ఱెలు (ఇశ్రాయేలీయులు) చెదరిపోయారు. చెదరిన వాటిని గూర్చి దేవుడు తన బాధను వ్యక్తపరుస్తూ-ఇదిగో నేను నేనే నా గొఱ్ఱెలను వెదకి వాటిని కనుగొందును.... నేను మంచి మేతగల చోట వాటిని మేపెదను. ఇశ్రాయేలు యొక్క ఉన్నత స్థలముల మీద వాటికి దొడ్డి యేర్పడును (సంఘము). అక్కడ అవి మంచి దొడ్డిలో పండుకొనును" అని చెప్పెను (యెహెజ్కేలు 34:11,14).

దేవుడు:- 1. తప్పిపోయిన దానిని వెదకును

2. తోలివేసిన దానిని తోలుకొని వచ్చును.

3. గాయపడిన దానికి కట్టు కట్టును

4. దుర్బలముగా ఉన్నదానిని బలపరచును.

అయితే క్రొవ్విన వాటికిని, బలముగల వాటికిని శిక్షయను మేత పెట్టి లయపరచును. యెహెజ్కేలు 34:16

గమనిక : చెదరిపోయిన గొఱ్ఱెలను (అనగా అన్యులను, ఇశ్రాయేలీయులను) రక్షించి ఏకము చేయుట కొరకు తండ్రియైన దేవుడు తనయుడైన క్రీస్తుని ఈ లోకమునకు పంపి ఉన్నత స్థలముల మీద అనగా పర్వతములపై (యెషయా 2:2) దొడ్డి అనగా సంఘం స్థాపించి ఒకే ద్వారమును ఒకే మంచికాపరిని యిచ్చారు.

## యేసుక్రీస్తు మంచి కాపరి :- (Jesus Christ is good Shepherd)

నేను గొఱ్ఱెలకు మంచికాపరిని, మంచికాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును (యోహాను 10:11).

నేనే ద్వారమును నాద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల్ల వాడు రక్షింపబడినవాడై, లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేత మేయుచునుండును (యోహాను 10:9).

**A.** మంచి కాపరి లక్షణములు :-

1. ద్వారము గుండా ప్రవేశించును (దేవుని సంకల్పము చొప్పున చేయును).
2. తప గొఱ్ఱెలను పేరు పెట్టి పిలుచును. క్రీస్తు తన బిడ్డలను ఎరుగును (యోహాను 10:15). వారి ప్రతి పనిని ఎరుగును, వారితో ఎల్లప్పుడు జీవించును.
3. గొఱ్ఱెలకు ముందుగా నడుచును. క్రీస్తు శిష్యులకు ముందుగా నడిచి నిష్కపటమైన జీవితమునును జీవించెను. ఆలాగుననే మనము కూడ తన అడుగుజాడలయందు నడువవలెనని మనకు మాదిరి యుంచి పోయెను.
4. గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును. (ఉదా :- తప్పిపోయిన గొఱ్ఱెకొరకు కాపరి వెదకుటను క్రీస్తు చెప్పిన ఉపమానం). తప్పిపోయిన గొఱ్ఱెలను అనగా నశించిన దానిని వెదకి రక్షించుటకు క్రీస్తు ఈ లోకమునకు వచ్చెను.

లూకా 19:10; 1తిమోతి 1:15; 1పేతురు 1:19. పాపములో చనిపోయిన వారికి ఆయన జీవము అనుగ్రహించెను. హెబ్రీ 2:9 రోమా 5:8,9; ఎఫెసీ 2:1.

**B.** గొఱ్ఱెలకు ఉండవలసిన మంచి లక్షణములు :-

1. కాపరి స్వరము వినును. క్రీస్తు మన కాపరి గనుక మనం ఆయన స్వరమును వినవలెను అనగా ఆయన చిత్తమును గ్రహించి దానికి విధేయత చూపవలెను రోమా 12:2, రోమా 10:17.

2. కాపరిని వెంబడించును:- a) చీకటిలో నడువక జీవపు వెలుగులో నడువవలయును అనగా పాపమును విడిచి నీతిని అనుసరింపవలయును 1యోహాను 1:6,7.

b) శరీర కార్యములు విసర్జింపవలెను, ఆత్మ ఫలములు ఫలింపవలయును (గలతీ 5:19-22).

c) దుర్గుణములను విడిచి సద్గుణములు కల్గియుండవలెను సహోదరప్రేమ, దయ, క్రీస్తుని గూర్చిన జ్ఞానము భక్తి కల్గియుండవలెను (1పేతురు 5:11, తీతు 2:12,15 యాకోబు 1:27).

ముగింపు:- ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు (1పేతురు 5:4). ఆ ప్రత్యక్షతను ఎదురుచూస్తూ విశ్వాసము కాపాడుకొనుము.

- జె.కె. ఏలియా, గుడ్డిగూడెం.

- 0-

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమముల ద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. 25/-లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ. 100-00 లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మా వద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు:

| | |
|---|---|
| 1. కీర్తన పుస్తకం | రూ. 15-00 |
| 2. పెద్ద అచ్చు బైబిలు | 100-00 |
| 3. బైబిలు | 55-00 |
| 4. 15 నుండి 20 పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : పోస్టేజీ అదనం. మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

28నుండి మే 2వ తేదీ వరకు సువార్త సభలు నిర్వహించిరి. ఆ సభలలో సోదరులు కె.బి.బి. చంద్రపాల్ (విజయవాడ), కె.కొర్నేలియస్ (కోరుకొండ), వి. సుదర్శనరావ్ (రాజమండ్రి) గార్లు వాక్యపరిచర్య చేయగా దంపతులిరువురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ సంఘమునకు రేడియో గాయకులు సోదరులు వై. యోహాను గారు వాక్య పరిచర్య చేయుచున్నారు.

1999 మే నెల 14వ తేదీ శుక్రవారం నాడు అమెరికాలో విద్యనభ్యసించు చున్న జాషువా గూటం గారి కుమారుడు జాన్ రికీ గారు వేసవి సెలవులు నిమిత్తం క్షేమంగా కాకినాడ చేరుకొన్నారు. ఆయన మరల ఆగస్టు నెలలో అమెరికా వెళ్లుదురు.

మే నెల 19వ తేదీ బుధవారం నాడు సోదరులు యమ్. సామ్యూల్ రాజుగారి కుమార్తెకును, మద్రాసులోని జి. దేవదానం గారి కుమారుడు వంశీ భూషణంకును బిక్కవోలు బైబిలు స్కూలు ఆవరణలో ఘనముగా వివాహము జరిగెను. సోదరులు కె.బి.బి. చంద్రపాల్ గారు వివాహ కార్యక్రమమును నిర్వహించగా, సోదరులు విజయకుమార్ (బెంగుళూరు), జాషువా గూటం గార్లు వివాహ సందేశముల నిచ్చిరి. పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు తమ ఆశీస్సులను, హెచ్చరికలను అందించిరి. ఆనాటి కార్యక్రమమునకు సోదరులు జీవన్ బిషోప్ (విజయవాడ) గారు అధ్యక్షత వహించిరి.

1999 జూన్ 1,2,3 తేదీలలో కాకినాడ సమీపమున గల కొవ్వాడ గ్రామములో ప్రతిరాత్రి గొప్ప సువార్త కూటములు జరిగెను. ఈ కూటములను కొవ్వాడ, రేపూరు క్రీస్తు సంఘములు నిర్వహించిరి. ఈ కూటములలో మొదటి ప్రసంగమును జాన్ రిక్కీ గూటం గారు అందియ్యగా భోజరైన వారందరు ఆయనను అభినందించిరి. మరియు నెహెమ్యా గూటం, పి.చంద్రశేఖర్, టి. నోబుల్‌రాజు ఆనంద్, బి.తాతారావ్, జాషువా గూటం గార్లు కూడ వాక్య పరిచర్య చేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ కూటములను జయప్రదము చేయడానికి సోదరులు గంటా ఫిలిప్ గారు నిర్విరామ కృషి సల్పిరి. స్థానిక సంఘములు కూడ బహుగా సహకరించిరి. కొవ్వాడ, రేపూరు గ్రామములలో సోదరు॥ గంటా ఫిలిప్ గారు వాక్య పరిచర్య చేయుచు అనేకులను క్రీస్తులోనికి,

ఆయన సంఘములోనికి నడిపించుచున్నారు.

జూన్ 6వ తేదీ ఆదివారం ఆచంట మండలం బాలమోరి వారి పాలెంలో యున్న క్రీస్తుసంఘమును సోదరులు జాషువా గూటం గారు దర్శించి, ఆరాధనలో వాక్యోపదేశం గావించిరి. ఆరాధన అనంతరం ఒకామె క్రీస్తులోనికి బాప్తిస్మము పొందెను. సోదరులు కె. మోషే గారు బాలమోరి వారి పాలెంలో వాక్యపరిచర్య చేయుచున్నారు. ఆచంటలో యున్న సోదరులు పి.సామ్యేలు, సామ్యేలురాజు గార్లు మోషే గారికి ఆయన చేయుచున్న పనికి మంచి ప్రోత్సాహమునిచ్చి నడిపించు చున్నారు.

విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఏప్రియల్ నెలలో 19మంది, మే నెలలో 16మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినట్లు సోదరులు కె.లూకా గారు తెలియజేశారు.

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004.
Editor : Joshua Gootam

RNI Regd. No. 69973/98
PRINTED BOOK - BOOK POST

From:
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001

To